# చివరి మజిలీ

డాక్టర్ ఆలూరి విజయలక్ష్మి

**పేషెంట్ చెప్పే కథలు**

ముడతలుపడ్డ నల్లటి ముఖం. రెండు కనుబొమల మధ్య విభూది. ఊపిరి తీసుకుంటున్న గుర్తుగా కదులుతున్న ఛాతీ. అగరొత్తుల వాసన. కబుర్లు చెప్పుకుంటూ సరస్వతమ్మ మంచం చుట్టూ కూర్చున్న ఆమె కూతుళ్ళు, కోడళ్ళు, మనుమలు, మనవరాళ్ళు.... విశాలంగా వుండే గది ఎంతో యిరుగ్గా వున్నట్లుంది.

ఎదురుగా నడవలో పడక కుర్చీలో పడుకున్నాడు సరస్వతమ్మ మామగారు రఘురామయ్య. గాజు కళ్ళతో కోడలి వంక చూస్తున్న ఆ ముదివగ్గు గుండె భారంగా వుంది తనెంత దురదృష్టవంతుడు! కన్నకొడుకు చేతుల్లో నిశ్చింతగా తనువు చాలించాల్సిన తనకు కడుపుశోకం మిగిల్చి నడివయసు దాటకుండానే కన్నుమూశాడు వొక్కగానొక్క కొడుకు. కొడుకు మరణానికి గుండె బ్రద్దలైన తన భార్య కొద్ది రోజులుకూడా గడవకుండానే కొడుకును వెదుక్కుంటూ వెళ్ళిపోయింది. కాపురానికి వచ్చింది మొదలు తనను, తన భార్యను కడుపున పుట్టిన బిడ్డకంటే ఆప్యాయంగా చూసుకున్న కోడలిప్పుడు కొడిగట్టిన దీపంలా ఈ నిమిషంలోనో, మరు నిమిషంలోనో ఆరిపోయేలావుంది. తన మీద మాత్రం మృత్యుదేవతకు కనికరం లేకుండా వుంది .... కోడలుపోయాక యింక తనగతి అధోగతే. తనకి మనిషిగా విలువిచ్చి ప్రేమగా పలకరించడం మాట దేవుడెరుగు, రెండుపూటలా రెండుముద్దలు విదిలిస్తారో లేదోకూడా అనుమానమే.... కోడలు చనిపోబోతూందన్న దుఃఖంతో పాటు తనముందు బ్రతుకెంత అధ్వాన్నంగా గడుస్తుందోనన్న బెంగకూడా తోడయింది రఘురామయ్యకు.

"మహా దొడ్డ యిల్లాలు. చేతికి ఎముక లేదు. చుట్టుప్రక్కల వాళ్ళందరికీ కష్టమొచ్చినా, సుఖమొచ్చినా నేనున్నానని నిలబడేది. భర్తపోయాక అందరి నక్కజిత్తుల్నీ కాచుకుని ఆస్తిని వృద్ధిచేసి నలుగురిచేతా శభాష్ అనిపించుకుంది. బిడ్డల్ని ప్రయోజకుల్ని చేసింది. ఆడపిల్లల్ని మంచి యిళ్ళల్లో యిచ్చింది" సరస్వతమ్మ గురించి చెప్తూంది ఎదురింటి మహాలక్ష్మమ్మ.

"చిన్న కొడుకుకోసం యింకా జీవుడు బొందిని విడవడంలేదు. ఆ ఢిల్లీ మహాపట్టణంనుంచి ఈ పల్లెటూరికి ఎప్పటికి చేరతాడోవాడు!" పయటచెంగుతో కళ్ళొత్తుకుంది సరస్వతమ్మ చెల్లెలు కాంతమ్మ

డాక్టరమ్మకోసం పట్నంవెళ్ళిన రామం కోసం అంతా ఆతృతగా ఎదురుచూడసాగారు. అప్పటికి మూడురోజులుగా స్పృహలేకుండా పడున్న సరస్వతమ్మను చూడడానికి వస్తూంది శ్రుతి.

"ఆమె కండిషన్ అంత బాగాలేదు. ఫిజీషియన్ సలహా తీసుకుంటే మంచిది. హాస్పిటల్‌కి షిఫ్ట్‌చేద్దాం" అంది శ్రుతి మొదటిరోజున సరస్వతమ్మనుచూడగానే.

"మాకు మీమీదే నమ్మకం. మీ చెయ్యి పడితే చాలు అమ్మకి నయమయిపోతుంది" తనేమైనా 'అమ్మా, బాబా' తన చెయ్యి పడగానే నయమయిపోతుందని వీళ్ళు భ్రమపడడానికి?! సరస్వతమ్మ కొడుకు మాటలు విని లోలోపల విసుక్కుంది శ్రుతి.

"మీకంటే బాగా మరో డాక్టరూ, మరో డాక్టరూ చేస్తాడంటే నమ్మకం లేదు. మీ ప్రయత్నం మీరు చెయ్యండి. శ్రమనుకోక రోజూ వచ్చి చూడండి. ఆపైన మా అదృష్టం." సరస్వతమ్మ పెద్దకూతురు అందుకుంది. ఆమె మాటలకు వంతపలికారామె చెల్లెళ్ళు. వాళ్ళది అమాయకత్వమనుకోవాలో, అతి తెలివనుకోవాలో అర్థం కాలేదు శ్రుతికి. సరస్వతమ్మను తనకంటే ఫిజీషియన్ బాగా ట్రీట్ చెయ్యగలడనేది తనకు తెలుసు. పైగా కొన్ని పరీక్షలు చేయించాలి. వాటినిబట్టిగాని రోగ నిర్ధారణ చెయ్యడానికి వీల్లేదు. పేషెంట్ అనుక్షణం డాక్టర్ పర్యవేక్షణలో వుండాలి. రోజుకోసారి వచ్చిచూసి చెయ్యగలిగేది కాదు. అదే వాళ్ళకు వివరించి నచ్చజెప్పాలని చూసింది శ్రుతి.

"ఈ యింటి కప్పుక్రిందే ప్రాణం విడవాలని అమ్మ కోరిక. అమ్మ కండిషన్ సీరియస్‌గా వుందని మీరే అంటున్నారు. మళ్ళీ హాస్పిటల్ కెందుకులెండి?" రామం మాటలు విని నొచ్చుకుంది శ్రుతి

"సీరియస్‌గా వుంది కాబట్టే బ్రతికించడానికి మరింత ఎక్కువ శ్రద్ధ తీసుకోవాలి. ప్రాణం పోయేంతవరకు బ్రతుకు గురించే ఆలోచించాలి కాని చావు గురించి కాదు" ఓర్పు తెచ్చిపెట్టుకుని వాళ్ళను ఒప్పించడానికి ప్రయత్నించింది శ్రుతి.

గంటసేపు వాళ్ళతో మాట్లాడాక శ్రుతికో కటువైన సత్యం బోధపడింది. ఎవరి సుఖం కోసం యిన్నేళ్ళుగా సరస్వతమ్మ అహర్నిశలూ శ్రమించిందో వాళ్ళిప్పుడు ఆమె ప్రాణం నిలపడంకోసం డబ్బు ఖర్చు చెయ్యడానికి సిద్ధంగా లేరు. మరీ బొత్తిగా అలా వదిలేసి వూరుకుంటే నలుగురూ నాలుగు మాటలంటారనే భయంతో టాక్సీమీద తనను తీసుకొచ్చి చూపిస్తున్నారు తప్ప-ఆమెను బ్రతికించుకోవాలనే తపన వాళ్ళకు లేదు. తనను పిలవడం వెనుకనున్న అంతరార్థం బోధపడ్డాక మరురోజురావడానికి శ్రుతి మనసు ఎదురు తిరిగింది. కాని తనకు పరిచయమయినప్పటినుంచీ తనకెంతో ఆదరం చూపిన సరస్వతమ్మకు ఆ మాత్రం చెయ్యడం తన నైతిక బాధ్యతగా భావించి రోజూ వస్తూంది.

శ్రుతి అక్కడ వుండగానే సరస్వతమ్మను ఇంటి వెనక పాకలోకి తరలించితే మంచిదనే ఆలోచన వచ్చింది వాళ్ళకు. తర్జన భర్జనచేసి అందరూ ఆక్షేపిస్తారేమోననే సంశయంతో ఆగిపోయారు.

కారు హారన్ వినిపించి అంతా బిలబిలా ఎత్తు అరుగులమీదకు వచ్చారు. శ్రుతికి ఎదురెళ్ళి లోపలకు తీసుకొచ్చింది రామం భార్య. సరస్వతమ్మను పరీక్షచేసి, నర్స్‌ని ఇంజక్షన్ తియ్యమని చెప్పి, పేషెంట్ పరిస్థితి యింకా దిగజారినందుకు విచార పడుతున్న శ్రుతి గుసగుసలు వినిపించి ప్రక్కకు తిరిగింది. అక్కడున్న ఆడ వాళ్ళందరికీ శ్రుతి చేతినవున్న వగశాల గాజుల్ని చూపిస్తోంది సరస్వతమ్మ కూతురు. పార్టీకి వెళ్ళిరాగానే గాజుల్ని తీసెయ్యడం మరిచిపోయి పేషెంట్ దగ్గరకు వచ్చినందుకు కించపడింది శ్రుతి.

"మా అమ్మ గొలుసు, గాజులు, దుద్దులు కలిసి మొత్తం ముప్పైతులాలుంటుంది బంగారం. అది మా ముగ్గురక్కచెల్లెళ్ళకీ చెందేదేకదా! ఒక్కొక్కరికి పదేసి తులాలొస్తుంది. డాక్టరమ్మగారి గాజులింత చక్కా ముచ్చటగావున్నాయి. ఇలాంటివి చేయించుకుంటాను" చిన్నగా చెప్తోంది సరస్వతమ్మ మూడో కూతురు. ఆమె మాటల్ని నివ్వెరపోయి వింటూంది శ్రుతి వీళ్ళలో ఏ ఒక్కరికీ ఆవిడ మాట్లాడుతున్న మాటలు అసమంజసంగా పరమదారుణంగా వున్నాయనిపించడంలేదా? తెలిసో తెలియకో కన్నతల్లి మృత్యుశయ్య దగ్గర నిలబడి ఆవిడలా అంటూంటే తప్పని ఒక్కరూ మందలించరేం?.... నిర్విణ్ణరంగా వింటూ, మామూలుగా మాట్లాడుకుంటున్న వాళ్ళనుంచి చూపులు తిప్పుకుని మరోసారి సరస్వతమ్మను పరీక్ష చెయ్యడానికి స్టెత్‌ని చేత్తో పట్టుకుంది శ్రుతి.

"వదినా! రేపో, ఎల్లుండో బంగారమిస్తే అమ్మ దినం నాటికి చేసి యిస్తాడంటావా కంసాలి?" సరస్వతమ్మ కూతురి ప్రశ్న. శ్రుతి చెయ్యి స్టెత్ మీద బిగుసుకుంది.




రీటాతో కేశ సంపద

జుట్టు అద్భుతంగా ఉండేటట్టు చేసేది రీటా. దానిలో అటువంటి శక్తీ, సువాసనా ఉన్నాయి - శిరోజాలు సహజంగా, చక్కగా పెరగడానికీ, నల్లదనానికీ, దానికదే సాటి. రీటా వాడి. మీ కురుల సౌభాగ్యాన్ని వృద్ధి చేసుకోండి. మీ శిరోజాలు ఏపుగా, ఒత్తుగా పెరిగి నిగనిగలాడుతూ మెత్తగా ఉంటాయి.

రీటా

నేడే ఒక సీసా కొనండి
ప్రతిచోటా దొరుకును




స్త్రీలూ పురుషులూ వాడుతున్నారు

ఇప్పుడు సూపర్ ఎకానమి (100 ml) సైజులో కూడా వస్తున్నది.